RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

వరంగల్ | గురువారం | పేజీలు 8 | లింగబత్తిని కృష్ణ సీఎండీ & ఎడిటర్ 9701923260
సంపుటి: 4 సంచిక:124 | మే 07, 2026 | వెల: రూ.3-00

దినపత్రిక




## రైతన్నలు కాళ్లు పట్టుడు బంద్ చేసి..

# కాంగ్రెసోళ్ల కాలర్ పట్టాలి

## రాబందు రాజ్యం పోయి.. రైతుబంధు రాజ్యం రావాలి



- ఎనుములు కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి..
- రెగ్యులర్ సీఎం కాదు.. రెన్యువల్ సీఎం
- రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా మోసం చేసింది
- రెండున్నరేళ్లలో వెయ్యిమందికి పైగా రైతులు చనిపోయారు
- ప్రతి రైతు కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలి
- రైతు సంగ్రామ సదస్సులో కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

**వేద న్యూస్, హన్మకొండ**

రైతులు కాంగ్రెస్ ప్రభుత్వ నయవంచనకు బలికావద్దని, గుండె ధైర్యం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకోవద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతు సోదరులకు విజ్ఞప్తి చేశారు. రైతులకు మళ్లీ మంచి రోజులు వస్తాయని, రెండేళ్లలో రాబందు రాజ్యం పోయి రైతుబంధు కేసీఆర్ రాజ్యం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. హనుమకొండలో నిర్వహించిన రైతు సంగ్రామ సదస్సులో పాల్గొన్న కేటీఆర్ రైతుల పక్షాన నాలుగు కీలక తీర్మానాలను ప్రకటించారు. కాంగ్రెస్ పాలనలో వెయ్యి మందికిపైగా రైతులు చనిపోయారని ఆరోపించిన కేటీఆర్, రోడ్డున పడిన ప్రతి రైతు కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ఇచ్చిన 34 హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. అన్ని పంటలను ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.500 బోనస్‌తో కొనుగోలు చేయాలని, రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి కాని రైతులకు వెంటనే రుణ విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుబంధు, రైతు బీమా పథకాలను పునరుద్ధరించాలని కోరారు. ఈ తీర్మానాలను కాంగ్రెస్ ప్రభుత్వానికి

మిగతా 2వ పేజీలో



## సాధారణ మహిళగా బస్టాండ్‌లో.. అర్ధరాత్రి ఒంటరిగా..!

**ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించిన మల్కాజిగిరి సీపీ సుమతి**

- అర్ధరాత్రి పోకిరీల అసలు రంగు బయటపెట్టిన లేడీ సింగం
- 40 మంది యువకులను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్

**వేద న్యూస్, హైదరాబాద్**

మహిళల భద్రత కోసం మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి స్వయంగా రంగంలోకి దిగారు. ఇటీవలే మల్కాజిగిరి సీపీగా బాధ్యతలు చేపట్టిన ఆమె బుధవారం అర్ధరాత్రి కీలక ఆపరేషన్ నిర్వహించి ఆకతాయిల ఆగడాలను బయటపెట్టారు. సీపీ సుమతి సాధారణ మహిళలా మారి బస్టాండ్‌లో ఒంటరిగా నిలబడ్డారు. అక్కడ ఉన్నవారికి ఆమె పోలీస్ కమిషనర్ అన్న విషయం తెలియకపోవడంతో పలువురు యువకులు ఆమె చుట్టూ చేరి వేధింపులకు పాల్పడ్డారు. సుమారు నలభై మంది వరకు యువకులు

మిగతా 2వ పేజీలో

## నర్సింగ్ కళాశాలలో ర్యాగింగ్ కలకలం

- సీనియర్లు, జూనియర్ల మధ్య ఘర్షణ
- ఆలస్యంగా వెలుగులోకి..
- ఫోన్ లాక్కోవడంతో వివాదం
- ర్యాగింగ్ ఘటనపై కౌన్సెలింగ్ నిర్వహించిన కళాశాల యాజమాన్యం

2లో



## కేటీఆర్ ఓ..420

- పాస్‌పోర్ట్ నుంచి భూముల కుంభకోణాల వరకు వారి చరిత్ర
- రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిని విమర్శించే స్థాయి ఉందా?
- ఉద్యమంలో దొంగచాటుగా చేరి నాయకత్వాన్ని దెబ్బతీశారు
- బీఆర్ఎస్ పాలనలో యువతను తప్పుదారి పట్టించారు
- రాష్ట్రాల వారీగా రాజకీయాలు వేర్వేరుగా ఉంటాయి
- కేటీఆర్‌పై మహేష్ గౌడ్ తీవ్ర విమర్శలు

**వేద న్యూస్, తెలంగాణ బ్యూరో**

హైదరాబాద్‌లో బుధవారం గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ బీఆర్ఎస్ నేత కేటీఆర్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. పీసీసీ వైస్ ప్రెసిడెంట్ సంగిశెట్టి జగదీష్‌తో కలిసి మాట్లాడిన ఆయన, కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని ఘాటు వ్యాఖ్యలు చేశారు. పాస్‌పోర్ట్ కుంభకోణం నుంచి భూముల కుంభకోణాల వరకు కేటీఆర్ కుటుంబం ప్రమేయం ఉందని ఆరోపించారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిని విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమంలో దొంగచాటుగా చేరి నాయకత్వాన్ని దెబ్బతీశారని, కేకే మహేందర్ రెడ్డి వంటి నేతలను పక్కనబెట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో యువతను మద్యానికి అలవాటు చేసి రాష్ట్ర భవిష్యత్తును దెబ్బతీశారని దుయ్యబట్టారు. ఒకే కుటుంబానికి పదవులు కేటాయించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. దళితుడిని ముఖ్యమంత్రిగా చేస్తానని చెప్పిన కేసీఆర్ తన మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. కేటీఆర్ వ్యాఖ్యల వెనుక మాదకద్రవ్యాల ప్రభావం ఉందనే అనుమానం వ్యక్తం చేశారు. సీబీఐ దర్యాప్తుపై కూడా స్పందిస్తూ, కేసును అప్పగిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పిన వారు ఇప్పటివరకు ఏం చేశారని ప్రశ్నించారు. జాతీయ స్థాయి రాజకీయాలు, రాష్ట్ర స్థాయి రాజకీయాలు వేర్వేరుగా ఉంటాయని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు. జాతీయ స్థాయిలో సీపీఎంతో

మిగతా 2వ పేజీలో

## గవర్నర్‌ను కలిసిన తళపతి

- ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలంటూ కోరిన విజయ్
- నెహ్రూ స్టేడియంలో విజయ్ ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు
- పూర్తి మెజారిటీకి తక్కువ స్థానాలతో టీవీకే..
- ప్రభుత్వ ఏర్పాటుపై సందిగ్ధత

2లో



## విజయ్‌కు మద్దతు ఇవ్వం

### స్పష్టం చేసిన ఏఐఏడీఎంకే

- టీవీకేకు మద్దతు ఇస్తున్నామన్న వార్తలు అవాస్తవమని స్పష్టం
- ప్రభుత్వ ఏర్పాటుకు సరిపడా సంఖ్యాబలం లేదన్న మునుస్వామి
- డీఎంకేకే మద్దతు కొనసాగిస్తామని వామపక్షాలు వెల్లడి
- తమిళనాడులో కొనసాగుతున్న ఉత్కంఠ

2లో



## ఫీజుల దోపిడీని కట్టడి చేయాలి



- ఉచిత విద్య, వైద్యం ప్రభుత్వ బాధ్యతే
- మే నెలలోనే ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి
- ప్రభుత్వం వెంటనే స్పందించాలి
- టీఆర్ఎస్ అధినేత్రి కవిత
- 'న్యాయమైన విద్య – ఫీజుల నియంత్రణ'పై రౌండ్ టేబుల్ సమావేశం

2లో

## మెట్రో ఫేజ్-2కు కేంద్రానికి సీఎం విజ్ఞప్తి

- కేంద్ర మంత్రి ఖట్టర్‌తో రేవంత్ రెడ్డి కీలక సమావేశం
- ఏడు కారిడార్లతో భారీ విస్తరణ ప్రణాళిక
- హైదరాబాద్ భవిష్యత్ రవాణాపై ప్రత్యేక దృష్టి

**వేద న్యూస్, న్యూ ఢిల్లీ**

హైదరాబాద్ నగర భవిష్యత్ రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెట్రో రైలు విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో హైదరాబాద్ మెట్రో ఫేజ్–2 ప్రాజెక్టుకు తక్షణ ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కోరారు. ఢిల్లీలో జరిగిన ఈ కీలక సమావేశంలో మెట్రో

మిగతా 2వ పేజీలో



## కాంగ్రెసోళ్ల కాలర్ పట్టాలి



**మొదటి పేజీ తరువాయి**

పంపిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఎనుముల రేవంత్ రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వరంగల్ వచ్చి భద్రకాళి అమ్మవారి సాక్షిగా రుణమాఫీ చేస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి మాట తప్పారని విమర్శించారు. రాష్ట్రంలోని ఏ గ్రామానికైనా వెళ్లి ఒక్క ఊరిలో అయినా రైతులందరికీ పూర్తి రుణమాఫీ జరిగిందని నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని కేటీఆర్ సవాలు విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ చారానా.. టోపీ బారానాలా మారిందని ఎద్దేవా చేశారు. రుణమాఫీ పూర్తికాక రైతులు పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో దందాలు, కమీషన్లు, కొట్లాటలే కనిపిస్తున్నాయని కేటీఆర్ విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి 69 సార్లు ఢిల్లీకి వెళ్లినా రాష్ట్రానికి 69 పైసలు కూడా తీసుకురాలేదన్నారు. ఆయన రెగ్యులర్ సీఎం కాదు.. రెన్యువల్ సీఎం అంటూ సెటైర్లు వేశారు. ఢిల్లీకి వెళ్లి కప్పం కడుతున్నారని, రాష్ట్రంలో "రాహుల్ బంధు" నడుస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. రైతులకు ఇవ్వడానికి పైసలు లేవు కానీ రాహుల్ గాంధీకి మాత్రం మూటలు పంపుతున్నారని ఆరోపించారు. రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ రైతులకు బోగస్ పత్రం ఇచ్చి మోసం చేసిందన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతులను దేశంలోనే నంబర్‌వన్ స్థాయిలో నిలబెట్టామని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ రైతు ప్రగతికి కేసీఆర్ అద్భుతమైన పథకాలు తీసుకొచ్చారని చెప్పారు. రైతుబంధు పథకాన్ని దేశంలోని పన్నెండు రాష్ట్రాలు అనుసరించాయని గుర్తుచేశారు. పదేళ్లలో రైతుల కోసం రూ.5 లక్షల కోట్లకుపైగా ఖర్చు చేసిన నాయకుడు కేసీఆర్ మాత్రమేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతుబంధు సమయానికి ఇవ్వడం లేదని కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్ హయాంలో నాట్లు వేసే సమయానికే రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో పడేవని గుర్తుచేశారు. ఇప్పుడు సర్పంచ్ ఎన్నికల ముందు ఓట్ల కోసం మాత్రమే ఒక్కసారి రైతు భరోసా ఇచ్చారని విమర్శించారు. లక్సెట్టిపేట కొనుగోలు కేంద్రంలో గోడ కూలి నలుగురు రైతులు మరణించారని, ధాన్యం కొనుగోలు కోసం రైతులు వానల్లో, ఎండల్లో పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో మళ్లీ పాత దుస్థితులు తిరిగి వస్తున్నాయని అన్నారు. రైతు డిక్లరేషన్ అమలు కోసం రైతులు కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. రైతన్నలు కాళ్లు పట్టుడు బంద్ చేసి.. కాంగ్రెస్ వాళ్ల కాలర్ పట్టాలి అంటూ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీకి పిండం పెడితేనే రైతులకు మంచి రోజులు వస్తాయని అన్నారు. మక్కలు కొనకపోతే ప్రభుత్వం వెయ్యి ముక్కలవుతుందని హెచ్చరించారు. రాష్ట్రంలో రైతుల కోసం బీఆర్ఎస్ మళ్లీ పోరాటం చేస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం కోసం కేసీఆర్ హయాంలో అమలైన పథకాలను తిరిగి తీసుకొచ్చే వరకు పోరాటం కొనసాగుతుందని వెల్లడించారు.

## నర్సింగ్ కళాశాలలో ర్యాగింగ్ కలకల

- సీనియర్లు, జూనియర్ల మధ్య ఘర్షణ
- ఆలస్యంగా వెలుగులోకి..
- ఫోన్ లాక్కోవడంతో వివాదం
- ర్యాగింగ్ ఘటనపై కౌన్సెలింగ్ నిర్వహించిన కళాశాల యాజమాన్యం

**వేద న్యూస్, వరంగల్**

వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలో ఉన్న బీఎస్సీ నర్సింగ్ కళాశాలలో జరిగిన ర్యాగింగ్ తరహా ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల బీఎస్సీ నర్సింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థినులు, ఫస్ట్ మరియు సెకండ్ సెమిస్టర్ చదువుతున్న జూనియర్ విద్యార్థినుల మధ్య జరిగిన వాగ్వాదం కళాశాలలో కలకలం రేపింది. సమాచారం ప్రకారం ఎంజీఎం ఆసుపత్రికి



వెళ్లే బస్సు డీజిల్ ఖర్చుల కోసం జూనియర్ విద్యార్థిని సీనియర్లను ఫోన్ ద్వారా సంప్రదించి డబ్బులు అడిగినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై సీనియర్ విద్యార్థినులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ "జూనియర్‌వి మమ్మల్నే డబ్బులు అడుగుతావా?" అంటూ దురుసుగా మాట్లాడినట్లు ఆరోపణలు ఉన్నాయి. హాస్టల్‌లో ఫోన్ ఎలా ఉపయోగిస్తున్నావంటూ ప్రశ్నిస్తూ బాధితురాలి ఫోన్‌ను లాక్కున్నట్లు సమాచారం. దీంతో ఇరు వర్గాల మధ్య మాటామాటా పెరిగి వివాదం చోటుచేసుకుంది. ఈ ఘటనపై జూనియర్ విద్యార్థిని సోదరుడు ఆందోళన వ్యక్తం చేశాడు. తన సోదరికి ఏదైనా హాని జరుగుతుందేమోనన్న భయంతో బాధితురాలి సోదరుడు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు విషయం తెలిసిన వెంటనే కళాశాల ప్రిన్సిపల్ సునీత ఇరు వర్గాల విద్యార్థినులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డే స్కాలర్లు హాస్టల్‌లోకి వెళ్లవద్దని కళాశాల యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద కూడా ఘటనపై ప్రిన్సిపల్‌తో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యాసంస్థల్లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా కళాశాలల్లో చేరే విద్యార్థులు ఇంటి నుంచి దూరంగా ఉండటం, కొత్త వాతావరణానికి అలవాటు పడే సమయంలో ర్యాగింగ్ వంటి ఘటనలు వారిలో భయాందోళనలు పెంచుతున్నాయని చెబుతున్నారు. సున్నిత మనస్తత్వం కలిగిన విద్యార్థులు ర్యాగింగ్‌ను తట్టుకోలేక మానసికంగా కుంగిపోతున్నారని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ర్యాగింగ్ సంస్కృతి పూర్తిగా నిర్మూలించేందుకు కళాశాలలు కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# కల్లాల్లో నీరు.. రైతు కంట కన్నీరు!

**వేద న్యూస్, పెద్దపల్లి**

జిల్లాల్లో మంగళవారం రాత్రి అకస్మాత్తుగా కురిసిన ఈదురు గాలులతో కూడిన వర్షం ఎండల తీవ్రత నుంచి ఉపశమనం ఇవ్వడం పక్కన పెడితే పెను విషాదాన్ని, భారీ నష్టాన్ని మిగిల్చింది, అకాల వర్షం నుంచి పంటలను కాపాడుకు నే క్రమంలో రైతులు ప్రాణాలు కోల్పోయా రు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్ళముందే తడిసిపోవడంతో అన్నదాతలు కన్నీరు మున్నీరవుతున్నారు. కాగా.తెలంగాణ వాతావరణశాఖ అలర్ట్ జారీ చేసింది, రానున్న మరో 3 రోజుల పాటు పలు జిల్లాల్లో ఈదురు గాలులు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణశాఖ అంచనా వేసింది. మొన్నటివరకు తెలుగు రాష్ట్రాల్లో ఎండలు తీవ్రరూపం దాల్చగా.. మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షం తో రైతుల కుటుంబా ల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. వరి ధాన్యా న్ని కాపాడుకోవాలని కల్లాల వద్దకు వెళ్లిన రైతులపై మృత్యువు విరుచుకుపడింది. మంచిర్యాల జిల్లాలో రాత్రి కురిసిన వర్షానికి నలుగురు రైతులు మృతిచెందగా.. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు.అయితే అకాల వర్షాల తో రైతుల ప్రాణ నష్టం, వంట నష్టం వాటిల్లిం ది.దీంతో తమను అదుకోవాలని ప్రభుత్వాలను రైతులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై స్పందించిన మంత్రి వివేక్ రైతు లెవ్వరు ఆందోళన చెందవద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి ధైర్యం చెప్పారు.మంగళవారం రాత్రి, పెద్దపల్లిజిల్లా తోపాటు మంచిర్యాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం దంచి కొట్టింది, కొనుగోలు కేంద్రాలలో పోసిన ధాన్యం తడిసి ముద్ద యింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట నీటిపాలు కావడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. నేటి నుంచి మే 8వ తేదీ వరకు నాగర్ కర్నూల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశముందని వాతావరణశాఖ అంచనా వేసింది. ఈ మేరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఇక నల్లగొండ, ఖమ్మం, రంగారెడ్డి, వరంగల్, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ జిల్లాల్లో పిడుగులతో కూడిన వానలు పడతాయని తెలిపింది.



## ఫీజుల దోపిడీని కట్టడి చేయాలి

**వేద న్యూస్, హైదరాబాద్**

హైదరాబాద్ స్కూల్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన 'నాణ్యమైన విద్య – ఫీజుల నియంత్రణ' రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యా వ్యవస్థ, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల పెంపు, ప్రభుత్వ బాధ్యతలపై ఆమె తీవ్ర స్థాయిలో స్పందించారు. ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నప్పటికీ ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల పెంపుపై ప్రభుత్వం స్పందించడం లేదని కవిత విమర్శించారు. కొన్ని పాఠశాలలు యాభై శాతం నుంచి నూట ఇరవై శాతం వరకు ఫీజులు పెంచినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మే నెలలోనే ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం ప్రభుత్వాల బాధ్యతేనని ఆమె స్పష్టం చేశారు. సమానత్వం, స్వేచ్ఛ, మానవ విలువలు విద్య ద్వారానే సాధ్యమని ప్రపంచం గుర్తించిందన్నారు. పిల్లల చదువు బాధ్యత కేవలం తల్లిదండ్రులదే కాదని, ప్రభుత్వం కూడా బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుతం అనేక ప్రైవేట్ విద్యాసంస్థలు వ్యాపార ధోరణితో నడుస్తున్నాయని కవిత ఆరోపించారు. రాజకీయ నాయకులకు చెందిన విద్యాసంస్థలే ఎక్కువగా ఉన్నాయని, విద్యను వ్యాపారంగా మార్చడం ఆందోళనకరమని అన్నారు. ఫీజుల దోపిడీకి తక్షణ పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో అరవై నాలుగు లక్షల మంది విద్యార్థుల్లో ఎక్కువ శాతం ప్రైవేట్ పాఠశాలల్లోనే చదువుతున్నారని ఆమె తెలిపారు. పిల్లలు బాగా చదువుకోవాలన్న తల్లిదండ్రుల బలహీనతను కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు వ్యాపారంగా మార్చుకున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే జీవో జారీ చేసి గతేడాదితో పోలిస్తే ఒక్క రూపాయి కూడా ఫీజులు పెంచకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ పబ్లిక్

**టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత**



స్కూల్‌లో ఈ ఏడాది నూట ఇరవై శాతం ఫీజులు పెంచడాన్ని కవిత తీవ్రంగా తప్పుబట్టారు. ప్రభుత్వ స్థలంలో ఉన్న పాఠశాలలోనే ఇంత భారీగా ఫీజులు పెరగడం దౌర్భాగ్యమని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించి స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వేల కోట్ల రూపాయల మేర పేరుకుపోయాయని కవిత పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని బలహీనపరిచేలా తీసుకొచ్చిన జీవోలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉచిత విద్య, వైద్యం విషయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటానని ఆమె స్పష్టం చేశారు. తమిళనాడు తరహాలో ఫీజుల నియంత్రణకు శాశ్వత అథారిటీ ఏర్పాటు చేయాలని, లేదా గుజరాత్ మాదిరిగా ఫీజులకు పరిమితి విధించే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. విద్య, వైద్యం అంశాల్లో ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కవిత కోరారు.

## గవర్నర్‌ను కలిసిన విజయ్

**వేద న్యూస్, నేషనల్ బ్యూరో**

తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. టీవీకే పార్టీ అధినేత, ప్రముఖ నటుడు విజయ్ చెన్నైలోని లోక్ భవన్‌లో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ను కలిశారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకున్న నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటూ గవర్నర్ కార్యాలయం ఆహ్వానం పంపింది. ఈ నేపథ్యంలో విజయ్ తనకు తగిన మెజారిటీ ఉందని నిరూపించేందుకు మద్దతు ఇస్తున్న ఎమ్మెల్యేల జాబితాతో కూడిన లేఖను గవర్నర్‌కు సమర్పించారు. ప్రభుత్వం ఏర్పాటు ప్రక్రియలో ఇది కీలక దశగా భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో విజయ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ హాజరయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే–కాంగ్రెస్ కూటమి పోటీ చేసినప్పటికీ, టీవీకేకు పూర్తి మెజారిటీకి కొద్దిగా తక్కువ స్థానాలు రావడంతో కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇవ్వడానికి ముందుకు వచ్చినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

## విజయ్‌కు మద్దతు ఇవ్వం

**వేద న్యూస్, నేషనల్ బ్యూరో**

**స్పష్టం చేసిన ఏఐఏడీఎంకే**

తమిళనాడు రాజకీయాలు రోజురోజుకు ఆసక్తికరంగా మారుతున్నాయి. టీవీకే అధినేత విజయ్ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో తమ పార్టీ ఆయనకు మద్దతు ఇవ్వడం లేదని ఏఐఏడీఎంకే స్పష్టం చేసింది. టీవీకేకు మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని వస్తున్న వార్తలను పార్టీ ముఖ్యనేత కేపీ మునుస్వామి ఖండించారు. టీవీకే పార్టీకి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అవసరమైన సంఖ్యాబలం లేదని మునుస్వామి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే విజయ్‌కు మద్దతు ప్రకటించినప్పటికీ అది ప్రభుత్వ ఏర్పాటుకు సరిపోదని పేర్కొన్నారు. మరోవైపు టీవీకే ఆహ్వానం ఇచ్చినప్పటికీ వామపక్ష పార్టీలు, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ కూడా విజయ్‌కు మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశాయి. ఎన్నికల్లో విజయం సాధించిన సీపీఐ(ఎం), సీపీఐ ఎమ్మెల్యేలు డీఎంకే అధ్యక్షుడు ఎం.కె. స్టాలిన్‌ను కలిసి తమ మద్దతు కొనసాగుతుందని ప్రకటించారు. అటు ఐయూఎంఎల్ ఎమ్మెల్యేలు కూడా డీఎంకేకే తమ మద్దతు కొనసాగుతుందని వెల్లడించారు. దీంతో తమిళనాడులో రాజకీయ సమీకరణాలు మరింత ఉత్కంఠగా మారాయి. ఇప్పటికే టీవీకేకు ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు పది మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరమన్న చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఏఐఏడీఎంకే కూడా మద్దతు ఇవ్వబోదని ప్రకటించడంతో విజయ్ తదుపరి వ్యూహంపై ఆసక్తి నెలకొంది. తమిళనాడు రాజకీయాల్లో రాబోయే రోజుల్లో మరిన్ని కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశముందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## సాధారణ మహిళగా బస్టాండ్‌లో.. అర్ధరాత్రి ఒంటరిగా..!

**మొదటి పేజీ తరువాయి**

ఆమెను ప్రశ్నలతో ఇబ్బంది పెట్టినట్లు సమాచారం. ఈ ఘటనలో ఎక్కువ మంది విద్యార్థులే ఉండటం గమనార్హంగా మారింది. మహిళలు రాత్రి వేళల్లో ఎదుర్కొనే ఇబ్బందులను స్వయంగా తెలుసుకునేందుకే ఈ ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించినట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి. కొంతసేపటి తర్వాత అక్కడికి చేరుకున్న పోలీసులు ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళల భద్రత విషయంలో రాజీపడబోమని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజా ప్రదేశాల్లో మహిళలను ఇబ్బంది పెట్టే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని వెల్లడించారు. మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదులు చేయాలని పోలీసులు సూచించారు.

## కేటీఆర్ ఓ..420

**మొదటి పేజీ తరువాయి**

అనుబంధం కొనసాగుతుందని, కేరళలో మాత్రం రాజకీయ పోరాటం ఉంటుందని వివరించారు. అదేవిధంగా తమిళనాడులో డీఎంకేతో కలిసి ఎన్నికలకు వెళ్లినప్పటికీ, అక్కడి పరిస్థితుల దృష్ట్యా టీవీకేకు మద్దతు ఇచ్చామని తెలిపారు. ధాన్యం, మొక్కజొన్న, వరి కొనుగోళ్లపై ప్రభుత్వం నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేసిందని, రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణేనని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలా విడతల వారీగా కాకుండా పూర్తి స్థాయిలో రుణమాఫీ చేశామని తెలిపారు. వ్యవసాయ రంగంలో శాస్త్రవేత్తల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రైతులకు సబ్సిడీపై ఆధునిక యంత్రాలు అందిస్తున్నామని చెప్పారు. రైతు భరోసా ద్వారా కూడా అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల్లో వరుస పరాజయాలతో బీఆర్ఎస్ నైరాశ్యంలో ఉందని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. రైతు సమస్యలపై చర్చకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రైతుల ఆత్మహత్యలు, గౌరవెల్లి, మల్లన్నసాగర్ ఘటనల సమయంలో బీఆర్ఎస్ వ్యవహరించిన తీరును ప్రజలు మర్చిపోలేదన్నారు. కాళేశ్వరం, విద్యుత్ కొనుగోలు వ్యవహారాలపై విచారణ జరుగుతోందని, నిజాలు బయటకు రావాలని కోరారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ఒకే విధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.

### మెట్రో ఫేజ్-2కు కేంద్రానికి సీఎం విజ్ఞప్తి

**మొదటి పేజీ తరువాయి**

ఫేజ్–2, ఫేజ్–3 విస్తరణ ప్రణాళికలపై సమగ్ర చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ నగరం రోజురోజుకు విస్తరిస్తోందని, పెరుగుతున్న జనాభా, వాహన రద్దీ కారణంగా ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ సమస్యలను తగ్గించి ప్రజలకు వేగవంతమైన, సురక్షితమైన, పర్యావరణహిత రవాణా సౌకర్యాలు అందించేందుకు మెట్రో విస్తరణ అత్యంత కీలకమని పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్–2 కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర ప్రాజెక్టు నివేదికను రూపొందించి కేంద్రానికి సమర్పించినట్లు ముఖ్యమంత్రి వివరించారు. ఏడు కారిడార్లతో మొత్తం 122.9 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరణ చేపట్టాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ భారీ ప్రాజెక్టుకు సుమారు రూ.38,595 కోట్ల వ్యయం అంచనా వేసినట్లు వెల్లడించారు. ఫేజ్–2 ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం సంయుక్త భాగస్వామ్యంతో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రాజెక్టుకు త్వరితగతిన ఆమోదం లభిస్తే నగర రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వస్తాయని తెలిపారు.

# నిజాంసాగర్ కాలువల కబ్జా!

- పక్కా భవనాల నిర్మాణాలతో సాగునీటి ప్రవాహానికి ఆటంకం
- ఫిర్యాదులు వచ్చినా స్పందించని ఇరిగేషన్ అధికారులు
- ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్



**వేద న్యూస్, వర్ని :**

వర్ని మండల కేంద్రంలో నిజాంసాగర్ ప్రధాన కాలువ ఆక్రమణలకు గురవుతున్నప్పటికీ ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాలువ స్థలాల్లో పక్కా భవనాల నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోటయ్య క్యాంపు సమీపంలో ప్రధాన కాలువపై నిర్మాణాలు చేపడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సాగునీటి కాలువలను ఆక్రమించడం వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం కోటయ్య క్యాంపు వద్ద నిజాంసాగర్‌కు చెందిన విలువైన భూములు కబ్జాకు గురవుతున్నాయని, ప్రధాన కాలువ వెంట దాదాపు రెండు కిలోమీటర్ల మేర ఆక్రమణలు కొనసాగుతున్నాయని సమాచారం. అయినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. సాగునీటి కాలువలను రక్షించి ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు, స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# సొసైటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సిద్ధు



**వేద న్యూస్, కోటగిరి :**

కోటగిరి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ) ఛైర్మన్‌గా కూచి సిద్ధు బుధవారం తిరిగి బాధ్యతలు చేపట్టారు.కొన్ని నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం సొసైటీ పాలకవర్గాలను రద్దు చేయగా, ఈ నిర్ణయం చట్ట విరుద్ధమంటూ రాష్ట్ర స్థాయి పాలకవర్గాల కమిటీ కోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన కోర్టు పాత పాలకవర్గాలను కొనసాగించాలని ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వుల మేరకు కూచి సిద్ధు సొసైటీ డైరెక్టర్లతో కలిసి తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సొసైటీ పరిధిలోని రైతుల అభివృద్ధికి మరింత కృషి చేస్తామని తెలిపారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని పేర్కొన్నారు.

# హనుమకొండ రెడ్ క్రాస్‌లో పరిపాలన భవనం ప్రారంభం

- తలసీమియా బాధితుల కోసం డైనింగ్ హాల్‌కు భూమిపూజ
- 'రెడ్ క్రాస్ మార్గ్'గా రహదారి నామకరణం



**వేద న్యూస్, హనుమకొండ :**

హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. తలసీమియా బాధితుల కోసం వరంగల్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మించనున్న డైనింగ్ హాల్‌కు భూమిపూజ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్యాట్రన్ నాయిని రాజేందర్ రెడ్డి, కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన పరిపాలన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం రెడ్ క్రాస్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిని "రెడ్ క్రాస్ మార్గ్"గా నామకరణం చేసి బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, రక్తదాన సేవలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో రెడ్ క్రాస్ రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలుస్తోందని అభినందించారు. తలసీమియా బాధితుల కోసం నిర్మిస్తున్న డైనింగ్ హాల్‌ను నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఛైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యుడు ఇ.వి. శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# సల్కునూరు సొసైటీ ఛైర్మన్‌గా గడ్డం స్పృధర్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ

**వేద న్యూస్, నల్లగొండ :**



తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.597 ఉపసంహరణ నేపథ్యంలో సల్కునూరు సహకార సంఘం సొసైటీ ఛైర్మన్‌గా గడ్డం స్పృధర్ రెడ్డి బుధవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఆమనగల్లు గ్రామానికి చెందిన ఆయనతో పాటు పాలకవర్గ సభ్యులు కూడా తమ పదవీ బాధ్యతలను యథావిధిగా చేపట్టారు. ఈ సందర్భంగా గడ్డం స్పృధర్ రెడ్డి మాట్లాడుతూ, సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. రైతులు వ్యవసాయంలో అభివృద్ధి సాధిస్తేనే గ్రామాలు బలపడతాయని పేర్కొన్నారు. సల్కునూరు సొసైటీ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు పోరెడ్డి వెంకట్ రెడ్డి, పళ్ళ బిక్షం, బొమ్మగాని హరికృష్ణ, ఆరేళ్ల లింగయ్య, భూపతి సైదులు, అనుములపూరి జయసుధ, అలుగుబెల్లి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెట్రో ధరల పెంపుపై సీపీఐ నిరసన




- సామాన్య ప్రజలపై భారం మోపితే ఊరుకోం
- సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అందె స్వామి
- కరీంనగర్‌లో ఖాళీ సిలిండర్లతో ఆందోళన

**వేద న్యూస్, కరీంనగర్ :**

గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచేందుకు కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, సామాన్య ప్రజలపై భారం మోపితే చూస్తూ ఊరుకోమని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, మాజీ జెడ్పీటీసీ అందె స్వామి హెచ్చరించారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు బుధవారం కరీంనగర్ కమాన్ చౌరస్తా వద్ద సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అందె స్వామి మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఒకలా.. ఎన్నికల తర్వాత మరోలా వ్యవహరించడం బీజేపీకే సాధ్యమని విమర్శించారు. పెట్రోల్, డీజిల్‌పై రూ.5, వంట గ్యాస్‌పై రూ.50 పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రైతులు, చిన్న వ్యాపారులు, సామాన్య ప్రజలపై ఈ ధరల పెంపు తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. వాణిజ్య సిలిండర్ ధరలు ఇప్పటికే భారీగా పెరిగాయని, గృహ వినియోగ గ్యాస్ ధరలు పెరిగితే పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. పెట్రోల్, డీజిల్ కొరత కారణంగా బంకుల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారని, ప్రభుత్వం మాత్రం కొరత లేదని చెప్పడం సరైంది కాదన్నారు. కరీంనగర్‌లో ఖాళీ గ్యాస్ సిలిండర్లతో నిరసన చేపట్టిన సీపీఐ నాయకులు, ధరల పెంపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా నాయకులు పైడిపెల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బామండ్లపెల్లి యుగేందర్, బూడిద సదాశివ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి




- డ్రైవర్లకు ఎస్పీ సూచనలు
- భారీ వాహనాలపై అవగాహన

**వేద న్యూస్, నల్లగొండ :**

జిల్లాలో భారీ వాహనాల వల్ల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో లారీ అసోసియేషన్ ప్రతినిధులు, ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యం, డ్రైవర్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ.. అధిక వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, అలసట, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. డ్రైవర్లు "డిఫెన్సివ్ డ్రైవింగ్" అలవాటు చేసుకుని ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వాహనాల్లో సాంకేతిక సమస్యలు వచ్చినప్పుడు రిఫ్లెక్టర్లు, ఇండికేటర్లు ఉపయోగించాలని, ప్రతి రెండు గంటలకు విశ్రాంతి తీసుకోవాలని చెప్పారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా వాహనాలు నిలపవద్దని హెచ్చరించారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు భారీ వాహనాలకు పట్టణంలో అనుమతి లేదని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య, లారీ అసోసియేషన్ ప్రతినిధులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

# ఐశ్వర్య గణపతిగా దర్శనమిచ్చిన శ్వేతార్క గణపతి

- సంకష్టహర చవితి సందర్భంగా విశేష పూజలు
- 108 కిలోల తేనెతో స్వామివారికి అభిషేకం



**వేద న్యూస్, కాజీపేట :**

కాజీపేటలోని స్వయంభు శ్రీ మూల గణపతి దేవాలయ దివ్యక్షేత్రంలో సంకష్టహర చవితి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్వేతార్క గణపతి ఐశ్వర్య గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయంలో స్వామివారికి 108 కిలోల తేనెతో విశేష అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో దేవాలయ వైదికులు అయినవోలు రాధాకృష్ణ శర్మ, సాయి కృష్ణ శర్మ, అర్చకులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండలంలోని రాయకూర్ గ్రామ చెరువు వద్ద ఉపాధిహామీ పనులు నిర్వహిస్తున్న కూలీలకు గ్రామ ఇంచార్జ్ సర్పంచ్ అర్చన అనీల్ పటేల్ బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని కూలీలకు ఉపశమనం కలిగించే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాల గంగాధర్, కంటపు గంగారాం, కుర్మి గంగారాం, కంటపు సాయిలు, కోర్బ శ్యామ్, ముకుందాల బాబు తదితరులు పాల్గొన్నారు.



వేద న్యూస్

గురువారం మే 07, 2026

# ‘టాస్క్’లో ఉచిత శిక్షణ



- టెక్నికల్, బ్యాంకింగ్ కోర్సులకు అవకాశం
- 11 నుంచి బ్యాచ్‌లు ప్రారంభం
- కలెక్టర్ గరిమ అగ్రవాల్

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

సిరిసిల్ల టాస్క్ (తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్) రీజనల్ సెంటర్‌లో టెక్నికల్, బ్యాంకింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ నెల 8న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించే ఓరియెంటేషన్ కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు. అర్హత, ఆసక్తి ఉన్న వారికి ఈ నెల 11 నుంచి శిక్షణ బ్యాచ్‌లు ప్రారంభమవుతాయని వెల్లడించారు. టాస్క్‌లో శిక్షణ పొందిన వారికి మంచి ప్యాకేజీలతో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొంటూ, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మరిన్ని వివరాలకు 9573420718, 7075522671 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# మందమర్రి కాంగ్రెస్ అధ్యక్షుడిగా తిరుమలరెడ్డి



- నూతన అధ్యక్షుడికి ఘన సన్మానం

**వేద న్యూస్, మందమర్రి :**

కాంగ్రెస్ పార్టీ మందమర్రి పట్టణ అధ్యక్షుడిగా మంద తిరుమలరెడ్డిని నియమించినట్లు మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన తిరుమలరెడ్డిని బుధవారం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంద తిరుమలరెడ్డి మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. ప్రతి కార్యకర్తతో కలిసి పార్టీని ప్రజలకు మరింత చేరువ చేస్తానన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

# కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

- పలువురు బీఆర్ఎస్ సర్పంచులు హస్తం గూటికి

**వేద న్యూస్, మహబూబ్‌నగర్ :**




రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై హన్వాడ మండలానికి చెందిన పలువురు సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. దాచక్‌పల్లి సర్పంచ్ వడ్డె శ్రీలత కృష్ణ, మాజీ సర్పంచ్ బాలకిష్టారెడ్డి, వెంకటమ్మకుంట తాండా సర్పంచ్ వెంకట్ నాయక్, వేపూర్ డిప్యూటీ సర్పంచ్ రమేష్‌తో పాటు పలువురు వార్డు సభ్యులు, బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా చేరుతున్నాయని తెలిపారు. గ్రామాల అభివృద్ధి, పాఠశాలల బలోపేతం, మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ప్రజల సమస్యలను క్యాంప్ కార్యాలయం ద్వారా నేరుగా స్వీకరించి పరిష్కరిస్తున్నామని, పారదర్శక పాలనతో ప్రజల్లో విశ్వాసం పెరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పద్మశాలి విద్యార్థులకు సన్మానం

- పదిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు



**వేద న్యూస్, చొప్పదండి:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన 10వ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన పద్మశాలి విద్యార్థిని, విద్యార్థులను చొప్పదండి పట్టణ పద్మశాలి కుల సంక్షేమ సంఘం మరియు యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక భక్త మార్కండేయ దేవాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ శాలువాలతో సత్కరించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలవాలని సంఘ నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి పట్టణ పద్మశాలి కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పచ్చునూరి తిరుపతి, యువజన సంఘం అధ్యక్షుడు అనుమల్ల సత్యం, కుల బాంధవులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న దిగుమతిలో ప్రభుత్వ వైఫల్యం



- నెల రోజులుగా గోడౌన్లలో నిలిచిపోయిన ధాన్యం
- సీపీఐ మండల కార్యదర్శి సాంబయ్య ఆగ్రహం

**వేద న్యూస్, నల్లబెల్లి :**

నల్లబెల్లి సెంటర్‌లో మొక్కజొన్న ధాన్య కాంటాలు పూర్తై నెల రోజులు గడుస్తున్నప్పటికీ, గోడౌన్లలో ధాన్యం దిగుమతి చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ నల్లబెల్లి మండల కార్యదర్శి బట్టు సాంబయ్య తీవ్రంగా విమర్శించారు. వివిధ గ్రామాల నుంచి రైతులు స్వచ్ఛందంగా సమకూర్చిన 100కు పైగా ట్రాక్టర్లు, 10 డీసీఎంలు, 8 లారీలలో ధాన్య బస్తాలను తీసుకురాగా, రైతు సొసైటీ గోడౌన్‌లో వాటిని దించేందుకు హమాలీలు నిరాకరించడంతో రైతులు రోడ్డుపై ట్రాక్టర్లు అడ్డుపెట్టి ధర్నాకు దిగారు. ఏప్రిల్ 23 నుంచి 30 వరకు కాంట్రాక్టర్ వాహనాలు అందుబాటులో ఉన్నప్పటికీ, అధికారులు అగ్రిమెంట్ పత్రాలు ఇవ్వకపోవడంతో వాహనాలు ఉపసంహరించుకున్నారని తెలిపారు. దీంతో రైతులే స్వయంగా వాహనాలు మాట్లాడుకుని ధాన్యం తరలించినా, గోడౌన్లలో ఖాళీ స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గతంలో కొంత ధాన్యం దిగుమతి చేసినప్పటికీ, బుధవారం హమాలీలు కూలీ డబ్బుల విషయంలో స్పష్టత లేదంటూ షట్టర్లు మూసివేసి వెళ్లిపోయారని తెలిపారు. స్థానిక ఎస్సై, ఎమ్మార్వోలు సాయంత్రం బస్తాల లెక్క చెప్పిన తర్వాత చెల్లింపులు చేస్తామని హామీ ఇచ్చినా, హమాలీలు అంగీకరించలేదన్నారు. వరుస వర్షాల హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారని, హనుమకొండలో రైతు మేళాలు నిర్వహిస్తున్న ప్రభుత్వం క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని బట్టు సాంబయ్య మండిపడ్డారు. “ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యం” అని ఆయన విమర్శించారు.

# భూ కబ్జాల వెనుక బడా నేతల హస్తం రెడ్డి

- యువ నేత వంగ రాజేశ్వర్
- గ్యార మల్లేశం కుటుంబానికి అండగా ఉంటా



**వేద న్యూస్, సిద్దిపేట :**

సిద్దిపేటను ఏలుతున్న ఓ బడా నేత తీరు చూస్తుంటే “ఉల్టా చోర్.. కొత్వాల్ కో డాంటే” అన్నట్టుగా ఉందని యువ నేత వంగ రాజేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవపూర్ గ్రామానికి చెందిన గ్యార మల్లేశం భూమిని రాజకీయ అండదండలతో అక్రమంగా కబ్జా చేసి, రికార్డులను ఇతరుల పేర్లకు మార్చారని ఆరోపించారు. మంగళవారం గ్యార మల్లేశం కుటుంబాన్ని పరామర్శించిన వంగ రాజేశ్వర్ రెడ్డి, బాధితుడి ఆరోగ్య పరిస్థితి, భూ వివాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి భూమిని కబ్జా చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూ అక్రమాల వెనుక ఎంత పెద్ద నాయకులు, అధికారులు ఉన్నా వారిని బయటపెట్టి చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు వెనక్కి తగ్గేదిలేదని స్పష్టం చేశారు. అవసరమైతే పోలీస్ శాఖ, ఉన్నతాధికారులు, కోర్టులను ఆశ్రయించి బాధితుడికి న్యాయం జరిగేలా పోరాడుతానన్నారు. తనపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి విష ప్రచారాలను ప్రజలు నమ్మరని వంగ రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. తాను స్వచ్ఛమైన రాజకీయాల కోసం పనిచేస్తున్నానని, బెదిరింపులకు భయపడబోనని అన్నారు. తప్పుడు పోస్టులు వైరల్ చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. గ్యార మల్లేశం ఆరోగ్య పరిస్థితిపై కూడా స్పందించిన ఆయన, అవసరమైతే హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో ఉచిత వైద్యం అందేలా సహాయం చేస్తానని భరోసా ఇచ్చారు..

# వడ్ల కొనుగోలు కోసం రైతుల ధర్నా



- 20 రోజులైనా కొనుగోలు లేదని ఆవేదన
- రైతులకు మద్దతుగా బీజేపీ నాయకులు

**వేద న్యూస్, హుస్నాబాద్ :**

హుస్నాబాద్ పట్టణంలోని అరెపల్లె వడ్ల కొనుగోలు కేంద్రం వద్ద రైతులు నిర్వహించిన ధర్నాకు బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. నెల రోజులుగా వడ్లు పోసి ఎండలో నిరీక్షిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ రైతులు బుడగ జంగాల కాలనీ ప్రధాన రహదారిపై గంటసేపు బైఠాయించి నిరసన చేపట్టారు. రైతులకు మద్దతుగా బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు నాయకులతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం హుస్నాబాద్ ఎస్సై లక్ష్మారెడ్డి సమక్షంలో తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడగా.. 2, 3 రోజుల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. ఈ సందర్భంగా బత్తుల శంకర్ బాబు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 20 రోజులు గడిచినా ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేయక రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. తాలు, తరుగు పేరుతో 5 నుంచి 6 కిలోల వరకు కోతలు పెడుతున్నారని ఆరోపించారు. అరెపల్లె కేంద్రంలో వెంటనే 3 లారీలు ఏర్పాటు చేసి కొనుగోలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. హామీ అమలు కాకపోతే రైతులతో కలిసి మంత్రి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

# కొందుర్గ్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పురుషోత్తం రెడ్డి



- యువ నాయకత్వానికి పార్టీ హైకమాండ్ గుర్తింపు

**వేద న్యూస్, కొందుర్గ్ :**

షాద్‌నగర్ నియోజకవర్గ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించిన యువ నేత కొవ్వూరి పురుషోత్తం రెడ్డిను కాంగ్రెస్ పార్టీ కొందుర్గ్ మండల అధ్యక్షుడిగా నియమించింది. పార్టీ కోసం కష్టకాలంలోనూ అండగా నిలుస్తూ, కార్యకర్తలకు ధైర్యం చెప్పిన నాయకుడిగా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. పార్టీ అధికారంలో లేకున్నా గ్రామ గ్రామాన తిరుగుతూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో పురుషోత్తం రెడ్డి కీలక పాత్ర పోషించారని నాయకులు పేర్కొంటున్నారు. కార్యకర్తల సమస్యలపై ముందుండి పోరాడుతూ, అక్రమ కేసులు, గృహ నిర్బంధాలు ఎదురైనా పార్టీ జెండాను వదల్లేదని కొనియాడుతున్నారు. సభలు, సమావేశాలను సమర్థంగా నిర్వహించే నాయకత్వ లక్షణాలు ఆయనలో ఉన్నాయని, ప్రశ్నించే ధైర్యాన్ని కార్యకర్తలకు నేర్పిన యువ నాయకుడిగా గుర్తింపు పొందారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. యువ నాయకత్వానికి అవకాశం ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని, కొందుర్గ్ మండలంలో పార్టీకి కొత్త ఉత్సాహం వస్తుందని నాయకులు, కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# పీఎంజే దోపిడీ కేసులో కొత్త ట్విస్ట్



- ఐదుగురు కాదు.. ఆరుగురు ఉన్నారా?
- ధర్మపురి లాడ్జిలో మూడు రోజుల బసపై పోలీసుల దర్యాప్తు

**వేద న్యూస్, కరీంనగర్ :**

కరీంనగర్‌లోని పీఎంజే జువెలరీ షాపు దోపిడీ కేసు దర్యాప్తులో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటివరకు ఐదుగురు నిందితులే ఉన్నారని భావించిన పోలీసులు, తాజాగా ముఠాలో ఆరుగురు సభ్యులు ఉన్నారనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దర్యాప్తులో భాగంగా ధర్మపురిలోని ఓ ప్రైవేట్ లాడ్జిలో నిందితులు మూడు రోజుల పాటు బస చేసినట్లు పోలీసులు గుర్తించారు. మొదట నలుగురు చేరగా, అనంతరం మరో ఇద్దరు విడిగా వచ్చి కలిసినట్లు సమాచారం. అక్కడే దోపిడీకి సంబంధించిన ప్రణాళిక రూపొందించినట్లు అనుమానిస్తున్నారు. లాడ్జి రిజిస్టర్‌లు, సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. నిందితులు నకిలీ గుర్తింపు కార్డులతో గదులు తీసుకున్నట్లు తెలిసింది. కేసు ఛేదన కోసం ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# కారేపల్లిలో సోలార్ కేంద్రం ప్రారంభం

- రైతు వారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్




**వేద న్యూస్, కారేపల్లి :**

వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ బుధవారం కారేపల్లిలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డీసీసీబీ బ్యాంక్ సమీపంలో హనుమకొండ రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'అమిటీ ఇండియా' సోలార్ & ఆయుర్వేదిక్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పునరుత్పాదక ఇంధన వనరులైన సోలార్ వినియోగంతో తక్కువ ఖర్చుతో విద్యుత్ అందుతుందని తెలిపారు. ఇలాంటి కేంద్రాల ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. అనంతరం అప్పాయిగూడెం రైతు వేదికలో నిర్వహించిన రైతు వారోత్సవ కార్యక్రమంలో పాల్గొని రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతుల సమస్యలను తెలుసుకుని త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బైరు గోపి, దుగ్గినేని శ్రీనివాసరావు, భూక్య రంజిత్ కుమార్, మేదరి టోనీ తదితరులు పాల్గొన్నారు.

# బస్టాండ్‌లో సౌకర్యాల కరువు

- నిరుపయోగంగా మరుగుదొడ్లు
- తాగునీరు లేక ఇబ్బందులు
- ప్రైవేట్ వాహనాలతో బస్సుల రాకపోకలకు ఆటంకం
- వెంటనే సౌకర్యాలు కల్పించాలని ప్రజల డిమాండ్






**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోధన్, బాన్సువాడ, హైదరాబాద్, బీర్కూర్, పోతంగల్, మహారాష్ట్ర ప్రాంతాలకు ప్రతిరోజూ వందల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, బస్టాండ్‌లో సరైన వసతులు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. బస్టాండ్‌లో ఉన్న మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారడంతో మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు బయట హోటళ్లను ఆశ్రయించాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో మందుబాబులు బస్టాండ్‌లో మద్యం సేవించి సీసాలు, వాటర్ ప్యాకెట్లు పడేస్తుండటంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. తరచూ కుక్కలు, పందులు సంచరిస్తుండటంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. అదే విధంగా బస్టాండ్ ఆవరణలో ప్రైవేట్ వాహనాలు ఇష్టం వచ్చినట్లు పార్కింగ్ చేయడంతో బస్సుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. డ్రైవర్లు బస్సులు తిప్పేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులే దేవుళ్లు అంటూ ప్రచారం చేసే అధికారులు బస్టాండ్ సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరుగుదొడ్లు, తాగునీరు తదితర మౌలిక సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# వడ్ల కొనుగోళ్ల జాప్యంపై రైతుల ధర్నా

- బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి రోడ్డుపై బైఠాయింపు
- వెంటనే లారీలు ఏర్పాటు చేయాలని డిమాండ్



**వేద న్యూస్, కోనరావుపేట :**

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని మర్రి వద్ద రైతులు, బీఆర్ఎస్ నాయకులు భారీగా ధర్నా నిర్వహించారు. జిల్లాలో వడ్ల కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. రైతులు మాట్లాడుతూ.. ఇసుక తరలింపుకు వందల లారీలు అందుబాటులో ఉంటే, వడ్ల తరలింపుకు మాత్రం లారీలు రాకపోవడం దురదృష్టకరమన్నారు. అకాల వర్షాలతో వడ్లు తడిసి తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ధాన్యం సేకరణ వేగంగా జరిగేదని, ప్రస్తుతం కొనుగోళ్లలో ఎందుకు జాప్యం జరుగుతోందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే లారీలు ఏర్పాటు చేసి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ధర్నా కారణంగా రోడ్డుపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

# ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

- ధాన్యం సేకరణ వేగవంతానికి ప్రత్యేక చర్యలు
- రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రైతులు పండించిన వరి ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ఈ విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని పలు రైస్ మిల్లులను మార్కెట్ కమిటీ చైర్మన్లతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మిల్లుల్లో ధాన్యం దిగుమతి, మిల్లింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. మంత్రుల బృందం నిర్వహించిన సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు చేపడుతోందన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేందుకు అదనపు లారీలు, వ్యాన్లు ఏర్పాటు చేస్తున్నామని, అవసరమైతే ట్రాక్టర్లను కూడా వినియోగించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన ఆది శ్రీనివాస్.. రైస్ మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. తూకాల్లో తేడాలు వచ్చినా, రైతులకు ఇబ్బందులు కలిగించినా సహించేది లేదన్నారు. రైస్ మిల్లుల్లో నిల్వ సామర్థ్యం తగ్గితే జిల్లా కేంద్రంలోని అపారెల్ పార్క్ గోదాముల్లో ధాన్యం నిల్వ చేసేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

# వేధింపులు ఎదురైతే నిర్భయంగా ఫిర్యాదు చేయాలి

- మహిళా భద్రతపై షీ టీమ్ అవగాహన కార్యక్రమాలు




**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

జిల్లాలో మహిళల భద్రతను బలోపేతం చేయడం లక్ష్యంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో మహిళలు పని చేసే ప్రదేశాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహిళలపై జరిగే వేధింపుల నివారణ, పని ప్రదేశాల్లో భద్రతా చర్యలు, మహిళా చట్టాలపై సమగ్ర అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా తంగళ్లపల్లి మండల పరిధిలోని తాడూర్, గోపాల్రావుపల్లి, లక్ష్మీపూర్ గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు వెళ్లే మహిళలకు షీ టీమ్ అధికారులు అవగాహన కల్పించారు. ఎలాంటి వేధింపులు ఎదురైనా నిర్భయంగా షీ టీమ్ నంబర్ 87126 56425కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో మాట్లాడకూడదని, వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని మహిళలకు సూచించారు. వేధింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏప్రిల్ నెలలో జిల్లాలో వేధింపులకు పాల్పడిన వారిపై 4 ఎఫ్ఐఆర్‌లు, 2 పెట్టీ కేసులు నమోదు చేసి, వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐలు ప్రమీల, రవి, సిబ్బంది శ్రీలత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జమ్మూ కాశ్మీర్‌లో హైదరాబాద్ జవాను సురేందర్ సింగ్ మృతి

**వేద న్యూస్ హైదరాబాద్ :**



జమ్మూ కాశ్మీర్‌లో హైదరాబాద్ జవాను సురేందర్ సింగ్ మృతి చెందాడు. హైదరాబాద్‌లోని శాలిబండ ప్రాంతానికి చెందిన సిఆర్‌పిఎఫ్ హెడ్ కానిస్టేబుల్ సురేందర్ సింగ్ జమ్మూ కాశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో విధులు నిర్వహిస్తూ ఒక్కసారిగా స్పృహతప్పి పడిపోయాడు.గమనించిన తోటి సిబ్బంది వెంటనే అతడిని జైనాపురలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కి తరలించారు. అయితే హాస్పిటల్‌కు చేరుకునేసరికి సురేందర్ సింగ్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వేద న్యూస్

గురువారం మే 07, 2026

# ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్



- పెద్దమ్మ గుడి సమీపంలో పోలీసుల మెరుపు దాడి
- 160 గ్రాముల గంజాయి, బైక్, మొబైల్ స్వాధీనం

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసులు వెల్లడించారు. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. చెక్కపల్లి రోడ్డులోని పెద్దమ్మ గుడి సమీపంలో గంజాయి విక్రయం జరుగుతోందని అందిన సమాచారంతో ప్రత్యేక పోలీస్ బృందం మెరుపు దాడులు నిర్వహించింది. మధ్యాహ్నం 12:40 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా తిరుగుతున్న నాంపెల్లి గ్రామానికి చెందిన జడల నాగరాజు (50), వడిచర్ల జాన్ ప్రతాప్ రెడ్డి (60)లను అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. విచారణలో వారు వేములవాడకు చెందిన ఓ వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తేలిందన్నారు. నిందితుల వద్ద నుంచి 160 గ్రాముల గంజాయి, రూ.8 వేల విలువైన మాదక ద్రవ్యంతో పాటు ఒక వివో మొబైల్ ఫోన్, హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం ఇద్దరినీ రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. యువత జీవితాలను నాశనం చేస్తున్న మాదక ద్రవ్యాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతారని హెచ్చరించారు. గంజాయి సాగు, విక్రయాలు, రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎక్కడైనా గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ సమావేశంలో సీఐ వీరప్రసాద్, ఎస్సైలు ప్రేమానందం, సమీయోద్దీన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్సీ సెల్ పరిశీలకుడిగా డాక్టర్ చేపూరి

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**



వరంగల్,హన్మకొండ,జనగాం,ములుగు,జయశంకర్ భూపాలపల్లి,మహబూబాబాద్ జిల్లాల పరిశీలకుడిగా రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ డాక్టర్ చేపూరి చిరంజీవిని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరిశీలకుడిగా నియమించారు. ఇటీవల నూతనంగా ఎన్నుకోబడ్డ రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాలతో రాష్ట్ర ఎస్సీ సెల్ కమిటీ మరియు జిల్లాల ఎస్సీ సెల్ కమిటీల రద్దు కావడంతో నూతనంగా ఏర్పాటుకానున్న ఎస్సీ సెల్ రాష్ట్ర మరియు జిల్లా కమిటీల పునర్నిర్మాణం కోసం పని చేసే ఆశావహుల నుండి దరఖాస్తుల స్వీకరణ కోసం పరిశీలకుడిగా డాక్టర్ చేపూరి చిరంజీవిని ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ,టిపీసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లు నియమించారు. ఈ సందర్భంగా డాక్టర్ చిరంజీవి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని జిల్లాల తాజా మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షులు మరియు కమిటీని సమన్వయం చేసుకుంటూ ఆశావహుల నుండి దరఖాస్తు స్వీకరించుకొని స్థానిక ఎమ్మెల్యే ల సహకారంతో ఆయొక్క సమాచారాన్ని,దరఖాస్తులను రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయన,టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లకు అందజేస్తానని తెలియజేశారు. తనకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర కాంగ్రెస్ ప్రతినిధులకు డాక్టర్ చిరంజీవి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

# చొప్పదండిలో రైతు వారోత్సవాలు

- రైతులకు మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన



**వేద న్యూస్, చొప్పదండి:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక"లో భాగంగా చొప్పదండి పాక్స్ కార్యాలయంలో బుధవారం రైతు వారోత్సవాలు నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చొప్పదండి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు మార్కెట్ యార్డులో మంచి గిట్టుబాటు ధరలు లభిస్తాయని తెలిపారు. రైతులు మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా మార్కెట్ యార్డుకు వచ్చి తమ పంటలను విక్రయించుకోవాలని సూచించారు. ప్రత్యేక శ్రేణి కార్యదర్శి ఎల్. రాజేశ్వరి మాట్లాడుతూ.. రైతులకు మార్కెట్ యార్డులో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. రైతులు సరుకులు మార్కెట్‌కు తీసుకొచ్చే సమయంలో లేదా విక్రయించి తిరిగి వెళ్తున్న సమయంలో ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.1 లక్ష, శాశ్వత అంగవైకల్యం అయితే రూ.75 వేల, తాత్కాలిక అంగవైకల్యం అయితే రూ.25 వేల బీమా సౌకర్యం మార్కెట్ కమిటీ ద్వారా అందిస్తామని తెలిపారు. రైతు బంధు పథకం కింద నిల్వ ఉంచిన సరుకుపై 75 శాతం వరకు వడ్డీ లేని రుణ సౌకర్యం ఆరు నెలలపాటు అందుబాటులో ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పెరుమాండ్ల రవీందర్, జాతరకొండ ఓదయ్య, ఈర్ల స్వామి, చొప్పదండి మున్సిపల్ చైర్‌పర్సన్ వడ్లూరి సరిత, సహకార బ్యాంకు సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, హమాలీలు, కార్మికులు పాల్గొన్నారు. అనంతరం అభ్యుదయ రైతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి హాజరైన రైతులకు మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు.

# నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు

- సామాజిక బాధ్యతగా ముందుకొచ్చిన కుటుంబ సభ్యులు
- నేత్ర వైద్య విద్యకు కూడా తోడ్పాటు




**వేద న్యూస్, హనుమకొండ :**

వరంగల్ ఉరుసు బొడ్రాయి ప్రాంతానికి చెందిన తౌటి రాజ్యలక్ష్మి (85) అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె కుమారులు కోటేశ్వర్, మధుకర్ కుటుంబ సభ్యులు సమాజ హితం దృష్ట్యా నేత్రదానానికి అంగీకరించారు. తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి ఆధ్వర్యంలో, వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఎల్వీ ప్రసాద్ నేత్ర సేకరణ టెక్నీషియన్ నరేందర్ ద్వారా కార్నియా సేకరణ చేపట్టారు. మృతురాలు రాజ్యలక్ష్మి నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు చూపు లభించనుందని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేస్తూ నేత్రదాన సర్టిఫికెట్ అందజేశారు. మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా అంధులకు వెలుగు ఇవ్వడంతో పాటు నేత్ర వైద్య విద్యాభివృద్ధికి కూడా తోడ్పాటు అందించవచ్చని పేర్కొన్నారు. నేత్రదానం చేయదలచిన వారు 8790548706, 9490733650, 8340892985 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## హనుమకొండ డీసీసీ ప్రధాన కార్యదర్శిగా రమేష్

- పార్టీ బలోపేతానికి కృషికి గుర్తింపుగా కీలక బాధ్యతలు

**వేద న్యూస్, కమలాపూర్ :**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మాజీ ఎంపీపీ మాట్ల రమేష్‌ను కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. పార్టీ పట్ల విధేయతతో పనిచేస్తూ, కమలాపూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను ముందుండి నడిపిస్తున్నందుకు రాష్ట్ర హైకమాండ్ ఆయనకు జిల్లా స్థాయి పదవి అప్పగించింది. 2006 నుంచి 2011 వరకు కమలాపూర్ ఎంపీపీగా పనిచేసిన మాట్ల రమేష్‌కు రాజకీయంగా మంచి అనుభవం ఉంది. ఆయన ఏ పార్టీలో పనిచేసినా పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ, అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ముందుకు సాగే నాయకుడిగా గుర్తింపు పొందారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించడంలో కూడా కీలక పాత్ర పోషించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన క్రియాశీలకంగా పనిచేస్తున్నారని పార్టీ నాయకత్వం గుర్తించింది. ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలను వివరించి పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావడంలో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా మాట్ల రమేష్ మాట్లాడుతూ.. తనను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించిన పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట రాంరెడ్డి, హుజూరాబాద్ కాంగ్రెస్ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ క్రమశిక్షణతో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

## ఆటో దొంగతనం యత్నం.. ముగ్గురి అరెస్ట్

- నిందితులకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట :**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ సాయి ట్రేడర్స్ సమీపంలో ఆటో దొంగతనానికి ప్రయత్నించిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయాన్ని ఎల్లారెడ్డిపేట ఎస్ఐ కే. రాహుల్ రెడ్డి వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. గత నెల 19వ తేదీన ఎల్లారెడ్డిపేటకు చెందిన దుబ్బ శ్రీనివాస్ తన రెండు ట్రాలీ ఆటోలను శ్రీ సాయి ట్రేడర్స్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో పార్క్ చేశాడు. అదే గ్రామానికి చెందిన మంద ప్రశాంత్ (31), శివరాత్రి మహేందర్ (33), మానుక బాలకిషన్ (28) ఆటో అద్దం పగులగొట్టి దొంగతనానికి ప్రయత్నించారు. అయితే స్థానికులు గమనించడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విచారణలో నిందితుల్లో ఒకరైన మంద ప్రశాంత్ గతంలో ఐదు దొంగతనం కేసుల్లో నిందితుడిగా ఉండి జైలుకు వెళ్లి వచ్చినట్లు గుర్తించారు. బుధవారం ముగ్గురినీ అరెస్ట్ చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, వారికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ రాహుల్ రెడ్డి తెలిపారు.

## మోదీ సభను విజయవంతం చేద్దాం

- బీజేపీ మండల ఇంచార్జి జన్నే మొగిలి పిలుపు

**వేద న్యూస్, శాయంపేట :**



ఈనెల 10వ తేదీన హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభను చారిత్రాత్మకంగా విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు, మండల ఇంచార్జి జన్నే మొగిలి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శాయంపేట మండలంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు గ్రామీణ స్థాయికి చేరి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నాయని అన్నారు. హైదరాబాద్‌లో జరిగే భారీ సభ తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపుగా నిలవాలని, ప్రతి కార్యకర్త దీన్ని బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలను సమీకరించి సభను విజయవంతం చేయాలని కోరారు. యువత, మహిళలు, రైతులు సభలో పాల్గొని తమ మద్దతు తెలియజేయాలని పిలుపునిచ్చారు. సభకు సంబంధించిన రవాణా, సమన్వయం, గ్రామ స్థాయి బాధ్యతలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి బూత్ స్థాయిలో సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాయరాకుల, మండల ప్రధాన కార్యదర్శి భూతం తిరుపతి, సీనియర్ నాయకులు బాసని విద్యాసాగర్, ఉప్పు రాజు, బూర ఈశ్వర్, మండల ఉపాధ్యక్షుడు కొమ్మటి రాజశేఖర్, కార్యదర్శి మేకల సుమన్, కోశాధికారి కుక్కల మహేష్, భూత్ అధ్యక్షులు పున్నం సాంబయ్య, కన్నెబోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 8న కోటమైసమ్మ ఆలయ దుకాణాల బహిరంగ వేలం

**వేద న్యూస్, కారేపల్లి :**



ఉసిరికాయలపల్లి గ్రామంలోని కోటమైసమ్మ ఆలయానికి చెందిన దుకాణాల బహిరంగ వేలం ఈనెల 8వ తేదీన ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు దేవాదాయశాఖ ఈవో కొండకింది వేణుగోపాలాచార్యులు, ఆలయ ట్రస్టీ చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభి రామారావు తెలిపారు. బుధవారం ఆలయ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆలయానికి చెందిన టెంటు సామాన్లు అద్దెకు ఇవ్వడం, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కులను 2026 జూలై నుంచి 2027 మే వరకు ఒక సంవత్సరం కాలానికి లీజుకు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ఆలయానికి చెందిన షాపు నంబర్లు 1 నుంచి 7 వరకు నెలవారీ కిరాయి పద్ధతిలో బహిరంగ వేలం ద్వారా కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ షాపుల లైసెన్స్ గడువు 2026 మే నుంచి 2027 ఏప్రిల్ వరకు 12 నెలలపాటు ఉంటుందని స్పష్టం చేశారు. వేలంపాటలో పాల్గొనే వారు వేలం పూర్తైన వెంటనే పూర్తి కిరాయి మొత్తాన్ని చెల్లించి రశీదు పొందాలని, లేనిపక్షంలో వేలాన్ని రద్దు చేసి మళ్లీ నిర్వహిస్తామని తెలిపారు. చెల్లించిన డిపాజిట్ తిరిగి ఇవ్వబడదని పేర్కొన్నారు.

వేద న్యూస్

గురువారం మే 07, 2026

# బోరింగ్ మరమ్మతు.. తాగునీటి సరఫరా పునరుద్ధరణ

**- సర్పంచ్ చొరవతో నీటి కష్టాలకు చెక్**



**వేద న్యూస్, కారేపల్లి :**

వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉసిరికాయపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు వెంటనే స్పందించి చర్యలు చేపట్టారు. గ్రామంలోని 3వ వార్డు పరిధిలో ఎల్లబోయిన బిక్షపతి నివాసం సమీపంలో ఉన్న బోరింగ్ పనిచేయకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకున్న సర్పంచ్, తక్షణమే బోరింగ్ రిఫ్రెషింగ్ పనులు నిర్వహింపజేశారు. దీంతో తాగునీటి సరఫరా పునరుద్ధరించబడింది. అదేవిధంగా ఆలియా తండాలో కూడా బోరింగ్ ప్రెస్సింగ్ పనులు చేపట్టించి అక్కడి ప్రజలకు నీటి కొరత లేకుండా చర్యలు తీసుకున్నారు. ఎండలను సైతం లెక్కచేయకుండా ప్రజల అవసరాలను ముందుంచి స్పందించిన సర్పంచ్ వరలక్ష్మి రాజు సేవాభావాన్ని గ్రామస్తులు అభినందించారు. గ్రామంలో ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరిస్తామని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడటం తన బాధ్యత అని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉడుగుల వెంకటేశ్వర్లు, పచ్చిపాల వెంకన్న, ఎల్లబోయిన బిక్షపతి, బోరింగ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# టోకెన్ విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలి

**వేద న్యూస్ జనగామ :**



ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా టోకెన్ విధానాన్ని పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం జిల్లాలోని నర్మెట్ట మండలంలోని బొమ్మకూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. కేంద్రంలో జరుగుతున్న కొనుగోలు ప్రక్రియ, రికార్డుల నిర్వహణ, ధాన్యం నిల్వ పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టోకెన్ విధానం సక్రమంగా అమలు చేస్తే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని తెలిపారు. కాంటా ప్రక్రియను వేగంగా పూర్తి చేసి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని అధికారులకు సూచించారు. లారీలు సమయానికి అందుబాటులో లేకపోతే వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించే వాహన యాజమాన్యంపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేంద్ర నిర్వాహకులు కొనుగోలుకు సంబంధించిన అన్ని రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన గన్ని సంచులను అందుబాటులో ఉంచుకోవడంతో పాటు ఓపీఎంఎస్‌లో కూడా కొనుగోలు వివరాలను వెంటనే నమోదు చేయాలని సూచించారు. అనంతరం రైతులతో మాట్లాడిన జిల్లా కలెక్టర్ కొనుగోలు ప్రక్రియపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్‌లు కప్పి భద్రపరచుకోవాలని రైతులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

# సీఎం సహాయ నిధితో మల్లేశం చికిత్సకు ఆర్థిక భరోసా

**- కాలేయం, మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న బాధితుడికి ఎల్ఓసి మంజూరు**

**- మాజీ మంత్రి బసవరాజు సారయ్య చొరవతో స్పందించిన సీఎం కార్యాలయం**

**- కుటుంబ సభ్యులకు ఎల్ఓసి పత్రం అందజేత**

**వేద న్యూస్ వరంగల్ :**



ఖిలా వరంగల్ మధ్యకోట యాదవ వీధికి చెందిన దేనబోయిన మల్లేశం కాలేయం, మూత్రపిండాల సంబంధిత అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన చికిత్సకు సుమారు ఐదు లక్షల రూపాయలు ఖర్చవుతుందని వైద్యులు వెల్లడించడంతో కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయం కోసం మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్యను సంప్రదించారు. మల్లేశం కుటుంబ ఆర్థిక పరిస్థితిని పరిశీలించిన ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య చికిత్స ఖర్చుల నిమిత్తం ఎల్ఓసి జారీ చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి కార్యాలయానికి లేఖ రాశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి కార్యాలయం సీఎం సహాయ నిధి కింద చికిత్సకు అవసరమైన మొత్తానికి ఎల్ఓసి మంజూరు చేసింది. ఈ సందర్భంగా దేనబోయిన మల్లేశం కుమారుడు ప్రసాద్‌కు ఎల్ఓసి పత్రాన్ని అందజేశారు. కుటుంబ సభ్యులు సీఎం కార్యాలయం, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని నాయకులు పేర్కొన్నారు. సీఎం సహాయ నిధి ద్వారా అనేక మంది నిరుపేదలకు వైద్య సహాయం అందుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్, ఐఎన్టీయూసీ నాయకులు బైరబోయిన చంద్రమౌళి, కూచన ఏకాంబరం, కాంద్రాతి లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలు సరికాదు

**వేద న్యూస్, శాయంపేట :**



- నరహరిశెట్టి రామకృష్ణ

శాయంపేట మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జై శ్రీరామ్ అంటే పైసలు పడతాయా అని మంత్రి వ్యాఖ్యానించడం హిందూ భక్తుల మనోభావాలను అవమానించే విధంగా ఉందన్నారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యంగా మంత్రి కొండా సురేఖకు కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అందించిన నిధులపై సరైన అవగాహన లేదన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణకు జాతీయ రహదారులు, రైల్వే అభివృద్ధి, ఎయిమ్స్, ఐఐటీ, గిరిజన యూనివర్సిటీలు, సాగునీటి ప్రాజెక్టులు, గ్రామీణాభివృద్ధి, పీఎంఏవై గృహ నిర్మాణ పథకం, ఉజ్వల, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల ద్వారా వేల కోట్ల రూపాయల నిధులు అందాయని పేర్కొన్నారు. మోదీ కేవలం నాలుగు మాటలు మాట్లాడి వెళ్లిపోతారు అని వ్యాఖ్యానించడం కాంగ్రెస్ పార్టీ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న నాయకుడిని అవమానించడం సరైంది కాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ మతాలను రాజకీయాల కోసం వాడుకుంటుందని, బీజేపీ మాత్రం అభివృద్ధి, సంస్కృతి పరిరక్షణ కోసం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. మంత్రి కొండా సురేఖ వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# సమసమాజ స్థాపనే కమ్యూనిస్టుల లక్ష్యం

**- ప్రజా సమస్యలపై పోరాటమే నిజమైన నివాళి**

**- ఎర్రబెల్లి వీరబాబు వర్ధంతి సభలో సీపీఎం నేతల పిలుపు**



**వేద న్యూస్, కారేపల్లి :**

కుల, మత, ప్రాంత, సామాజిక వివక్షలు లేని సమసమాజ స్థాపన కమ్యూనిస్టుల ప్రధాన కర్తవ్యమని సీపీఎం సింగరేణి మండల కార్యదర్శి కే. నరేంద్ర అన్నారు. బుధవారం గుంపెళ్లగూడెంలో ఎర్రబెల్లి వీరబాబు 18వ వర్ధంతి సభ పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు వజ్జ రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కే. నరేంద్ర మాట్లాడుతూ.. దేశ సంపద కొద్దిమంది భూస్వాములు, పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థల చేతుల్లో కేంద్రీకృతం కాకుండా అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు, విద్య, ఉపాధి కల్పించడమే కమ్యూనిస్టుల లక్ష్యమన్నారు. కార్మిక వర్గ నాయకత్వంలో జనతా ప్రజాస్వామ్య విప్లవాన్ని సాధించడమే సీపీఎం వ్యూహమని తెలిపారు. ఎన్నికల్లో వచ్చే సీట్లతో మాత్రమే కమ్యూనిస్టుల బలాన్ని అంచనా వేయడం సరైంది కాదన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా, అవకతవకలు లేకుండా ఎన్నికలు జరిగితేనే నిజమైన ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్నాయని, ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా వ్యవహరించడం లేదని విమర్శించారు. కార్మిక చట్టాల రద్దు, ఉపాధి హామీ పథకానికి నష్టం, రైతులకు కనీస మద్దతు ధర చట్టం తీసుకురాకపోవడం, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజలను చైతన్యపరచడం, సమస్యలపై నిరంతరం పోరాడడమే ఎర్రబెల్లి వీరబాబుకు ఇచ్చే నిజమైన నివాళి అని కే. నరేంద్ర పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు తుమ్మోజు రామ్మూర్తి జెండా ఆవిష్కరించగా, మండల కమిటీ సభ్యులు జీ వెంకన్న, శాఖ కార్యదర్శి పాపిని నాగేశ్వరరావు, పార్టీ సభ్యులు పొట్లకాయల రమేష్, కే. కోటయ్య, కావేటి రాములు, బత్తుల సర్వయ్య, ఎర్రబెల్లి వెంకటేశ్వర్లు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తరుగు దోపిడీకి ఎమ్మెల్యే బాధ్యత వహించాలి

**- తరుగు కోతలు ఆపకపోతే ఆందోళనలు**

**- సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్**



**వేద న్యూస్, గంగాధర :**

చొప్పదండి నియోజకవర్గంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని, దీనికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బాధ్యత వహించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. గంగాధర చౌరస్తాలో బీజేపీ మండల అధ్యక్షుడు పంజాల ప్రశాంత్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన ధాన్యాన్ని కూడా బీ–గ్రేడ్‌గా చూపిస్తూ క్వింటాల్‌కు రూ.20 వరకు కోత విధిస్తున్నారని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించడంతో తేమ శాతం తగ్గి రైతులు అదనంగా నష్టపోతున్నారని అన్నారు. ఎఫ్‌సీఐ నిబంధనలకు విరుద్ధంగా మిల్లర్లు వ్యవహరిస్తున్నారని, అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే తరుగు కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని, లారీల సంఖ్య పెంచాలని, రైతులను ఇబ్బంది పెడుతున్న మిల్లర్లు, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా, మండల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# పీహెచ్‌సీలో వైద్య సేవలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**వేద న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం :**



చంద్రుగొండ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు, సిబ్బంది పనితీరును సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ విభాగాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. వైద్యుల అందుబాటు, మందుల సరఫరా, చికిత్స విధానం వంటి అంశాలపై ఆరా తీశారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి రిజిస్టర్లు, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించిన కలెక్టర్ డాక్టర్లు, నర్సులు, ఖాళీ పోస్టులపై సమాచారం సేకరించారు. మందుల నిల్వ గదిని తనిఖీ చేసి అవసరమైన అన్ని ఔషధాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రక్తపరీక్షలు, ఇతర నిర్ధారణ సేవల నిర్వహణపై కూడా కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. ల్యాబ్ పరికరాలు, పరీక్షల సదుపాయాలు సరిపడా ఉండేలా చూడాలని అధికారులకు సూచనలు చేశారు. ప్రసూతి విభాగాన్ని సందర్శించి గర్భిణీలకు అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. హోమియో వైద్యశాలలో వైద్యుడు లేకపోవడాన్ని గుర్తించిన జిల్లా కలెక్టర్ ఆ పోస్టును త్వరలో భర్తీ చేస్తామని తెలిపారు. ప్రజలకు అన్ని వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, మౌలిక సదుపాయాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఈ తనిఖీలో మెడికల్ అధికారి రాము, తాసిల్దార్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేద న్యూస్

గురువారం మే 07, 2026

# వస్త్ర పరిశ్రమలకు కోటి చీరల భారీ ఆర్డర్



వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :

- ఏడు జిల్లాల పరిశ్రమలకు ప్రజా ప్రభుత్వ ప్రోత్సాహం
- గడువులోగా నాణ్యతతో చీరలు పూర్తి చేయాలి
- నేతన్నల సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుంది
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాష్ట్రంలోని ఏడు జిల్లాల వస్త్ర పరిశ్రమలకు ప్రజా ప్రభుత్వం కోటి ఇందిరా మహిళా శక్తి చీరల భారీ ఆర్డర్‌ను అందజేసిందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన రంగుల చీరలను ఆవిష్కరించారు. గత ఏడాది 6 కోట్ల 85 లక్షల చీరల ఆర్డర్ ఇచ్చిన ప్రభుత్వం, ఈసారి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 130 మ్యాక్స్ సంఘాలతో పాటు కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, మంచిర్యాల, జనగాం, యాదాద్రి జిల్లాల వస్త్ర పరిశ్రమలకు మొత్తం కోటి చీరల ఆర్డర్ ఇచ్చిందని అధికారులు వెల్లడించారు. ఇందులో 95 లక్షల 6.3 మీటర్ల చీరలు, 5 లక్షల 9 మీటర్ల గోచి చీరలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో వస్త్ర పరిశ్రమ అభివృద్ధి బాటలో నడుస్తోందన్నారు. గ్రామీణ, పట్టణ మహిళల కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున చీరల పంపిణీ చేపడుతోందని తెలిపారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న రూ.352 కోట్ల బకాయిలను విడుదల చేశామని పేర్కొన్నారు. వేములవాడలో రూ.50 కోట్లతో యార్న్ బ్యాంక్ ఏర్పాటు చేసి పరిశ్రమకు మద్దతు ఇస్తున్నామని, నేతన్నల కోసం రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించామని తెలిపారు. చేనేత కార్మికుల రుణమాఫీతో పాటు పరిశ్రమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్ మాట్లాడుతూ.. గతంలో సరఫరా చేసిన చీరల నాణ్యతపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తెలిపారు. ఈసారి కూడా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ గడువులోగా ఆర్డర్ పూర్తి చేయాలని పరిశ్రమ ప్రతినిధులకు సూచించారు.

# ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభం

వేద న్యూస్ నాగర్ కర్నూల్ :



నాగర్ కర్నూల్ పట్టణంలో పెరుగుతున్న వాహన రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ప్రారంభించారు. పట్టణంలోని శ్రీపురం చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పట్టణాల్లో ట్రాఫిక్ నియంత్రణ అత్యంత అవసరమైందన్నారు. ప్రజలకు ప్రయాణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఆలోచనతో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శ్రీపురం చౌరస్తాతో పాటు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతంలో కూడా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ సిగ్నల్స్ వల్ల వాహనాల రాకపోకలు క్రమబద్ధీకరించబడటంతో పాటు ప్రమాదాల నివారణకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రజలందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని జిల్లా ఎస్పీ సూచించారు. వాహనదారులు హెల్మెట్, సీటుబెల్ట్ వంటి భద్రతా నియమాలను తప్పకుండా అనుసరించాలని, సురక్షిత ప్రయాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ డిఎస్పి శ్రీనివాస్, ఎస్సై గోవర్ధన్, ట్రాఫిక్ ఆర్ఎస్ఐ కళ్యాణ్, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ సునేంద్రతో పాటు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా ట్రాఫిక్ నియంత్రణకు తీసుకున్న ఈ చర్యలను స్థానిక ప్రజలు స్వాగతిస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాల్లో కూడా ఇలాంటి సదుపాయాలు కల్పించాలని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రభాస్ 'ఫౌజీ' నుంచి ఫస్ట్ సాంగ్ త్వరలో




వేద న్యూస్ డెస్క్:

రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఫౌజీ'పై రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. 'కల్కి 2898 ఏడీ'తో భారీ విజయాన్ని అందుకున్న తర్వాత ప్రభాస్ చేస్తున్న ఈ పీరియడ్ యాక్షన్ డ్రామా ఇప్పటికే టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రేమ, భావోద్వేగాలకు కొత్త అర్థం చెప్పిన 'సీతారామం' దర్శకుడు హను రాఘవపూడి ఈ సినిమాను తెరకెక్కిస్తుండటంతో ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ కొనసాగిస్తోంది. సినిమాపై ఉన్న హైప్‌ను మరోస్థాయికి తీసుకెళ్లేలా ఫస్ట్ సింగిల్ విడుదలకు చిత్రబృందం రెడీ అవుతోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, ఈ నెలాఖరులోనే మొదటి పాటను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే పాటకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయని, త్వరలో అధికారిక ప్రకటన కూడా వెలువడే అవకాశముందని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ ఫస్ట్ సాంగ్‌తోనే సినిమాకు గ్రాండ్ ప్రమోషనల్ క్యాంపెయిన్ ప్రారంభం కానుందని తెలుస్తోంది. ఈ చిత్రానికి సంగీతం ప్రధాన హైలైట్‌గా నిలవనుంది. 'సీతారామం'కు హృదయాన్ని తాకే స్వరాలు అందించిన విశాల్ చంద్రశేఖర్ ఈ సినిమాకూ సంగీతాన్ని సమకూర్చుతున్నారు. ప్రభాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా, కథలోని భావోద్వేగాలను ప్రతిబింబించేలా మెలోడీ, మాస్, క్లాసిక్ కలిపిన సంగీతాన్ని సిద్ధం చేసినట్లు సమాచారం. ముఖ్యంగా ఫస్ట్ సాంగ్‌లోనే సినిమా టోన్, ఎమోషన్‌ను చూపించే ప్రయత్నం చేసినట్టు టాక్ వినిపిస్తోంది. ఈ పాట ప్రేక్షకులను ఆకట్టుకుంటే సినిమాపై అంచనాలు మరింత రెట్టింపు కావడం ఖాయం. విజువల్స్ పరంగా కూడా 'ఫౌజీ' మరోస్థాయిలో ఉండబోతోంది. ప్రముఖ ఛాయాగ్రాహకుడు సుదీప్ ఛటర్జీ అద్భుతమైన సినిమాటోగ్రఫీతో సినిమాకు విజువల్ గ్రాండియర్‌ను తీసుకువస్తున్నారు. పీరియడ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి భారీ సెట్స్, నేచురల్ లొకేషన్స్, అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగిస్తున్నారు. ప్రతి ఫ్రేమ్ కూడా విజువల్‌గా ప్రేక్షకులను మెస్మరైజ్ చేసేలా మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలుస్తోంది. కథ పరంగా కూడా ఈ సినిమా ప్రత్యేకంగా ఉండనుంది. ప్రేమ, దేశభక్తి, త్యాగం వంటి భావోద్వేగాలను కలిపి దర్శకుడు హను రాఘవపూడి తన స్టైల్లోనే కథను నడిపించనున్నట్లు సమాచారం. ప్రభాస్ పాత్ర కూడా ఇప్పటివరకు చూడని కొత్త కోణంలో ఉండబోతోందని, ఆయన నటనకు ఇది మరో మైలురాయిగా నిలిచే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తంగా చూసుకుంటే, కథ, సంగీతం, విజువల్స్, స్టార్ పవర్ కలిసివచ్చి 'ఫౌజీ' సినిమాను భారీ అంచనాల మధ్య నిలబెట్టాయి. త్వరలో విడుదల కానున్న ఫస్ట్ సాంగ్ ఈ అంచనాలను మరింత పెంచే కీలక అడుగుగా మారనుంది. అభిమానులు ఈ అప్డేట్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, ఫస్ట్ సింగిల్ విడుదల తర్వాత సినిమా హైప్ కొత్త ఎత్తులకు చేరడం ఖాయం అని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# 'ఎల్లమ్మ'లో హీరోయిన్ క్లారిటీ.. మృణాల్ దాదాపు ఫైనల్

వేద న్యూస్ డెస్క్:

'బలగం' సినిమాతో భావోద్వేగాలను హృదయానికి హత్తుకునేలా తెరకెక్కించి జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న దర్శకుడు వేణు యెల్దండి, తన రెండో ప్రాజెక్ట్‌గా రూపొందిస్తున్న 'ఎల్లమ్మ' చిత్రంతో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రం ఇప్పటికే టాలీవుడ్‌లో ఆసక్తికర చర్చలకు దారితీస్తోంది. ముఖ్యంగా హీరోయిన్ ఎంపికపై నెలకొన్న ఉత్కంఠ ఇప్పుడు ముగిసే దశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో కథకు కీలకమైన, భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న మహిళా పాత్ర కోసం దర్శకుడు ఎంతో జాగ్రత్తగా ఎంపిక ప్రక్రియ చేపట్టారు. మొదట ఈ పాత్ర కోసం సాయి పల్లవిని సంప్రదించినట్లు వార్తలు వచ్చినప్పటికీ, తేదీల సమస్యల కారణంగా ఆమె ఈ ప్రాజెక్ట్‌కు దూరమైనట్లు సమాచారం. ఆ తరువాత కీర్తి సురేష్ పేరు బలంగా వినిపించగా, ఒక దశలో ఆమె ఎంపిక దాదాపు ఖాయమని కూడా ప్రచారం జరిగింది. అంతేకాకుండా శృతి హాసన్, భాగ్యశ్రీ భోర్సే, రుక్మిణి వసంత్ వంటి పలువురు నటీమణుల పేర్లు కూడా పరిశీలనలోకి వచ్చినట్లు తెలిసింది. అయితే తాజా సమాచారం ప్రకారం 'సీతారామం' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న మృణాల్ ఠాకూర్ ఈ పాత్రకు దాదాపు ఖరారైనట్లు ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. భావోద్వేగ సన్నివేశాల్లో తన నటనతో ప్రేక్షకులను కట్టిపడేసే సామర్థ్యం ఉన్న మృణాల్, ఈ సినిమాకు పెద్ద బలం అవుతుందని చిత్రబృందం భావిస్తోంది. ఆమె ఎంపికపై అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశముంది. ఈ చిత్రంలో మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న అంశం ఏమిటంటే, ప్రముఖ సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ ఈ సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. 'పార్శి' అనే శక్తివంతమైన పాత్రలో ఆయన కనిపించనున్నారు. ఇటీవల విడుదలైన గ్లింప్స్‌లో ఆయన లుక్‌కు మంచి స్పందన లభించింది. అంతేకాకుండా, ఈ చిత్రానికి సంగీతాన్ని కూడా ఆయనే అందిస్తున్నారు. 'ఎల్లమ్మ' సినిమా తెలంగాణ సంప్రదాయాలు, జానపద కళలు, ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడిన కథగా తెరకెక్కుతోంది. గ్లింప్స్‌లో చూపించిన వేప ఆకులు, పసుపు, కుంకుమ, గజ్జెల శబ్దాలు వంటి అంశాలు సినిమాకు ఒక ప్రత్యేకమైన వాతావరణాన్ని సృష్టించాయి. గ్రామీణ సాంస్కృతిక విలువలను ప్రతిబింబించేలా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని తెలుస్తోంది. ఈ చిత్రాన్ని దిల్ రాజు, శిరీష్‌లు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. హీరోయిన్ ఎంపికపై అధికారిక ప్రకటన వెలువడిన వెంటనే చిత్రీకరణ పూర్తి స్థాయిలో ప్రారంభం కానుంది. తెలుగుతో పాటు ఇతర దక్షిణాది భాషల్లో కూడా పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను విడుదల చేయాలని



నిర్మాతలు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మొత్తానికి, కథ, నటీనటులు, సాంకేతిక బృందం కలిసి 'ఎల్లమ్మ' సినిమాపై భారీ అంచనాలు పెంచుతున్నాయి. దర్శకుడు వేణు యెల్దండి మరోసారి తన ప్రత్యేక శైలిలో ప్రేక్షకులను మెప్పిస్తాడా లేదా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# నేహా శెట్టి ఫోటోలు వైరల్

వేద న్యూస్ డెస్క్:



యువ నటి నేహా శెట్టి తాజాగా సోషల్ మీడియాలో పంచుకున్న ఫోటోలు నెట్టింట వైరల్‌గా మారుతున్నాయి. గ్లామర్‌తో పాటు స్టైలిష్ లుక్‌లో కనిపించిన ఆమె చిత్రాలు అభిమానులను ఆకట్టుకుంటూ, నెటిజన్ల నుంచి విపరీతమైన స్పందనను దక్కించుకుంటున్నాయి. డైరెక్టర్ పూరి జగన్నాథ్ తనయుడు ఆకాష్ పూరి హీరోగా వచ్చిన 'మెహబూబా' సినిమాతో నేహా శెట్టి తెలుగు తెరకు పరిచయమైంది. ఆ సినిమా ఆశించిన విజయాన్ని అందుకోకపోయినా, తర్వాత సిద్ధు జొన్నలగడ్డతో కలిసి నటించిన 'డీజే టిల్లు' చిత్రంతో ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. ముఖ్యంగా 'రాధిక' పాత్రలో ఆమె నటన, గ్లామర్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. ఆ తరువాత కొన్ని తెలుగు సినిమాల్లో నటించినప్పటికీ, పెద్ద విజయాలు మాత్రం అందుకోలేకపోయింది. కొంతకాలంగా ఆమెకు అవకాశాలు తగ్గినట్లు కనిపిస్తోంది. పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఓజీ' సినిమాలో ఒక ప్రత్యేక గీతంలో కనిపించినప్పటికీ, సినిమా నిడివి కారణంగా ఆ సన్నివేశాన్ని తొలగించినట్లు సమాచారం. అయితే సినిమాల కంటే సోషల్ మీడియాలో మాత్రం నేహా శెట్టి యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో టచ్‌లో ఉంటోంది. తాజాగా ఆమె షేర్ చేసిన లేటెస్ట్ ఫోటోలు ట్రెండ్ అవుతుండగా, అభిమానులు ప్రశంసలతో పాటు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి, సినిమాల్లో అవకాశాలు తగ్గినా గ్లామర్, సోషల్ మీడియా యాక్టివిటీతో నేహా శెట్టి తన క్రేజ్‌ను కొనసాగిస్తూ దృష్టిని ఆకర్షిస్తోంది. భవిష్యత్తులో మంచి ప్రాజెక్టులతో ఆమె మళ్లీ బలంగా రీ-ఎంట్రీ ఇస్తుందా అన్నది చూడాలి.

# 'పెద్ది'లో ప్రత్యేక పాటపై ఆసక్తి




వేద న్యూస్ డెస్క్:

మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది' ప్రస్తుతం టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. దర్శకుడు బుచ్చిబాబు సానా రూపొందిస్తున్న ఈ క్రీడా నేపథ్య చిత్రం భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతూ ప్రేక్షకుల్లో పెద్ద ఎత్తున అంచనాలు రేకెత్తిస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన కథ, పాత్రల రూపకల్పన, ముఖ్యంగా రామ్ చరణ్ లుక్ ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తిని పెంచాయి. ఇటీవల ఈ చిత్రంలో ఒక ప్రత్యేక పాటను చిత్రీకరించినట్లు సమాచారం వెలువడింది. భారీ సెట్స్, ఆకట్టుకునే దృశ్యాలు, మాస్ బీట్‌లతో ఈ పాటను తీర్చిదిద్దినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ పాట చిత్రం మొత్తానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ప్రత్యేక పాట కోసం చిత్ర బృందం భారీ వ్యయం చేసినట్లు తెలుస్తోంది. అత్యాధునిక సాంకేతికతతో, విశాలమైన సెట్స్ మధ్య ఈ పాటను రూపొందించడం వల్ల ప్రేక్షకులకు కొత్త అనుభూతి కలిగేలా ఉంటుందని భావిస్తున్నారు. ముఖ్యంగా అభిమానులు ఈ పాట విడుదల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం, ముందుగా చిత్ర ట్రైలర్‌ను విడుదల చేసి, ఆ తర్వాత ఈ ప్రత్యేక పాటను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర బృందం ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073